# పరీక్ష

స్టాండ్‌లో బస్సు దిగి నాలుగడుగులు వేశాడో లేదో గంగాధరంకు ఎదురుగా ఒక వ్యక్తి వచ్చి నిలబడి "గంగాధరం గారు మీరేనా సార్" అనడిగాడు.... గంగాధరం ఆ కొత్త మనిషి వేపు పరకాయించి చూసి "నేనే" అన్నాడు-

"మా అయ్యగారు మిమ్మల్ని పిల్చుకురమ్మన్నారు సార్" అన్నాడా వ్యక్తి. "నన్ను పిలవడమేమిటి....?" అనడిగాడు గంగాధరం.

ఆ వ్యక్తి మునిముని నవ్వులు వొలకబోస్తూ "మా అయ్యగారు డిప్యూటీ తాసీల్దార్ రంగరాజు గారండి- నేనాయనగారి క్యాంప్ క్లర్క్- రామ్మూర్తిని" అన్నాడు.

గంగాధరం పూర్తిగా తెల్లబోయాడు- "డిప్యూటీ తాసీల్దార్ గారు నన్ను పిలవడమేమిటి? నేనసలు ఆయన మొహమే చూడందీ.... మీరు పొరపడుంటారు- మీరనుకున్న గంగాధరం నేనుగాదు-".

"మీరేనండీ? కొత్తపల్లె హైస్కూల్ సోషియల్ టీచర్ గంగాధరం గారు మీరే కదా!"

గంగాధరం మెదడు పని చేయటం క్షణ కాలం ఆగిపోయింది.... "అవునూ .... నేనే.... ఆశ్చర్యంగా వుందే! నన్నాయన పిలవడమేమిటి? నాకు రెవిన్యూ వ్యవహారమేదీ లేదే!"

"రెవిన్యూ వ్యవహారమేం గాదు సార్! మిమ్మల్ని వెంటనే తప్పని సరిగా పిల్చుకురమ్మన్నారు- గంట నుండీ మీ కోసం ఈ స్టాండులో కాచుకొనున్నాను- అయ్యగారిల్లు యిక్కడకు దగ్గరే- ఇంటి దగ్గరకే తీసుకు రమ్మన్నారు- రండి-"

గంగాధరంకు ఎంత వూహించినా ఆయన తన్నెందుకు పిలుస్తున్నట్లో బోధపడలేదు.... పోవటమా? మానటమా?....

ఇలాంటి స్థితి జీవితంలో కొత్త గంగాధరంకు-

"ఇంతకూ పనేమిటో మీరు చెప్పగలరా?"

"నాకు తెలదండీ—మీరాయన్ను కలవండి—ఆయనే చెబుతారు—త్వరగా రండి సార్— మళ్ళీ మీకు పరీక్షలకు టైమవుతుంది"

గంగాధరాన్ని ఏదో వుత్సుకత, ఆసక్తి అడుగులు ముందుకు వేయించింది.

గంగాధరం, రామ్మూర్తి వెనకాలే నడుస్తూ రకరకాలుగా ఆలోచించాడు. ఏ బలమైన కారణమూ అతని వూహకు తట్టలేదు- అతడు ఒకరకమైన 'సస్పెన్స్'ను అనుభవిస్తూ అడుగులేస్తున్నాడు-

నడుస్తూ, నడుస్తూ, తన చేతి వాచీలో టైమ్ చూసుకున్నాడు—పదిన్నర కావస్తోంది.... పదకొండున్నరకు పరీక్షలు ...పదకొండు గంటకల్లా సెంటర్లో వుండాలి.

ఆ వూరి జూనియర్ కాలేజీ సెంటర్లో, పదవ తరగతి పరీక్షలకు, గంగాధరం ఒక ఇన్విజిలేటర్‌గా నియమింపబడ్డాడు. ప్రతి రోజూ యిక్కడికి పదిమైళ్ళ దూరంలోవున్న, తన వుద్యోగం చేసే కొత్తపల్లి నుండీ, బస్సులో డ్యూటీకి హాజరవుతున్నాడు.... ఈ రోజు చివరి పరీక్ష.... సోషియల్ స్టడీస్ రెండవ పేపరు....

ఐదు నిముషాల నడక తర్వాత ఒక యింటిముందాగి "ఇదే అయ్యగారిల్లు.... రండి" అంటూ గేటుతీసి లోపలికి నడిచాడు రామ్మూర్తి. మెత్తగా అడుగులు వేస్తూ వెంబడించాడు గంగాధరం.

ఇంటి ముంగిట తలుపుకు పల్చటి కర్టెన్ వేలాడుతోంది.... కర్టెన్ చేతితో తొలగించి లోపలికి అడుగులు వేస్తూ "రండి" అంటూ గంగాధరంను ఆహ్వానించాడు రామ్మూర్తి. గంగాధరం లోపలకు అడుగుబెట్టాడు. హాల్లో సోఫా, సోఫాముందు టీపాయ్, సోఫాకు పక్కగా రెండు పేముకుర్చీలు. గోడకానుకొని పెద్దటేబిల్. టేబిల్ మీద రేడియో సెట్.

"మీరు కూచోండి." అని గంగాధరంకు ఒక పేముకుర్చీ చూపించాడు రామ్మూర్తి.

హాల్లో ఎవరూ లేరు. అంతా యింట్లో వున్నట్లుంది. రామ్మూర్తి తలుపు దాకా వెళ్ళి "సార్" అని పిల్చాడు. ఇంట్లో అలికిడయిన శబ్దం. గుహలో మృగాల్లా కదలుతున్న శబ్దం.

గంగాధరం గోడలకు వేలాడదీసిన కాలెండర్లవేపు చూస్తూ నిలబడే వున్నాడు.

లోపల్నుండి యాభై ఏళ్ళ వయస్సు, ఆరడగులు ఎత్తు, కండలు ఒక చోట కుప్ప బోసినట్టున్న దేహం, నల్లటి ఆకారం మీద తెల్లని బనియన్, అడ్డపంచె. వెరశి ఒక మానవాకారం బయటికి వచ్చింది. వచ్చీ రావటంతోనే నిల్చున్న గంగాధరంను చూసి "నిలబడేవున్నారేం.... కూచోండి.... కూచోండి...." అంటూ చాలా ఆప్యాయంగా గంగాధరాన్ని పలుకరించాడు.

గంగాధరం సంకోచిస్తూనే కుర్చీలో ఒదిగి కూచున్నాడు. రంగరాజు సోఫాలో కూచొని రామ్మూర్తికి ఏదో సైగ చేశాడు. రామ్మూర్తి లోపలకు వెళ్ళాడు.

గంగాధరం నిశ్శబ్దంగా రంగరాజు ముఖంలోకి చూశాడు- ముఖం నిండా కండలు.... లావుపెదవులు.... దళసరి కళ్ళద్దాలు.... పొట్టిక్రాపు....

ఏం మాట్లాడాలో అర్థంకాలేదు గంగాధరంకు-

"మీరు కొత్తపల్లెలో ఎంతకాలంగా పని చేస్తున్నారు-?" సంభాషణ ప్రారంభించటానికన్నట్టు రంగరాజు ప్రశ్నించాడు-

"ఇంకా సంవత్సరం కూడా కాలేదండి"

"మీ స్వగ్రామం ఈ తాలూకానేనా?"

"కాదండీ- పక్క తాలూకా-" గంగాధరంకు ఈ ప్రశ్నల స్వభావ మేమిటో బోధపడలేదు, యాంత్రికంగా జవాబులు చెబుతున్నాడు-

రామ్మూర్తి యింతలో ఒక ప్లేట్‌లో పూరీలు తెచ్చి గంగాధరం ముందుకు 'టీ పాయ్' జరిపి దాని మీద వుంచాడు. గంగాధరంకు ఈ సత్కారం అనూహ్యంగావుంది.

"టిఫిన్ తీసుకోండి-" రంగరాజు మాటల్లో ఆప్యాయత జాలు వారుతోంది.

"నేనింటి దగ్గర భోంచేసే బస్సెక్కానండీ.... సారీ...."

"ఎంత టిఫిన్ గనుక.... మీరు తీసుకోవాల్సిందే-"

గంగాధరం మొహమాటంలో కూరుకు పోతున్నాడు- టిఫిన్ తీసుకోటానికి అతని మనసు అంగీకరించటం లేదు-

"మీరు నన్ను పిలిపించిన పనేమిటో చెప్పండి.... నాకు టైమవు తుంది....పరీక్షలకు వెళ్ళాలి."

"పరీక్షలు పదకొండున్నరకు గదా! ఇప్పుడింకా పదిన్నరే- ముందు మీరు టిఫిన్ తినండి- మాటాడుకుందాం-"

ఇక కాదనే శక్తిలేక, ప్లేట్లోవున్న రెండు పూరీలను తిని చేతులు కడుక్కొన్నాడు. ముందుంచిన గ్లాసుడు కాఫీని కూడా గడగడా తాగేశాడు.

"పరీక్షలెలా జరుగుతున్నాయండీ-" రంగరాజు తాను కూడా కాఫీ సేవిస్తూ ప్రశ్నించాడు.

"బాగానే జరుగుతున్నాయండీ-" అంటూ చేతిగడియారం కేసి మరోసారి చూసుకున్నాడు గంగాధరం.

పైన 'ఫాన్' తిరుగుతున్నా వాతావరణం వేడిగానేవుంది. ముఖం మీద పొటమరిస్తున్న చెమటను చేతిరుమాలుతో అద్దుకున్నాడు గంగాధరం.

"నిన్న సోషియల్ స్టడీస్ ఫస్ట్ పేపర్ చాలాకష్టంగా వుందట కదండీ-"

"అవునండీ- చాలా మంది విద్యార్థులు దెబ్బతిన్నారు-"

"మావాడూ అలాగే అన్నాడండీ- నిన్న పేపరు సరిగా రాయలేదట- భోరున ఏడ్చేశాడు-"

గంగాధరంకు ఏదో మెదలుతోంది.... నిశ్శబ్దంగా వుండిపోయాడు...

"మావాడు, మీరు ఇన్విజిలేషన్ చేస్తున్న సెంటరులోనే పరీక్ష రాస్తున్నాడండీ- అన్ని పేపర్లూ బాగానే రాశాడు- నిన్నటి పేపర్లో బాగా దెబ్బతిన్నాడు- అందుకే ఈరోజు పేపర్లో, మీరు మావాని విషయంలో కొద్దిగా 'హెల్ప్' చేయాలి-" రంగరాజు ఆసక్తిగా గంగాధరం ముఖం లోకి చూశాడు.

"నేనా?" గంగాధరంకు సంగతి పూర్తిగా అర్థమయింది- ఇంత మర్యాద వెనుకవున్న రహస్యమిదా?

"అవునండీ- మీసబ్జెక్టు కూడా సోషియల్ స్టడీస్ గదా ! అందువల్ల మీరు కొద్దిగా 'లిఫ్ట్' యిస్తే మావాడు ఈ రెండో పేపర్లో మార్కులు తెచ్చు కుంటాడు. మీరు చాలా తెలివైన ఉపాధ్యాయులని తెలిసే మిమ్మల్ని ఈ సహాయం కోరుతున్నాను. మీరు మరోలా భావించకండి."

గంగాధరం ఏదో వుచ్చులో చిక్కుకుపోతున్నట్టు ఫీలవుతున్నాడు. "నాకెలా సాధ్యమవుతుందండీ- అంతమంది పిల్లల్లో మీ అబ్బాయికెలా సాయం చేయగలను-?"

"ఆ అరేంజిమెంట్" అంతా నేనప్పుడే చేశానండీ! మావాడు రూం నెంబరు 3 లో వుంటున్నాడు- పరీక్షల 'ఛీఫ్ సూపరెండెంట్' గారు నాకు బాగా తెలుసు- ఆయనతో చెప్పి మిమ్మల్ని ఆ రూమ్‌కే వేయించే ఏర్పాటు అప్పుడే చేశాను- మావాని నెంబరు....837- మొదటి డెస్కులోనే వానిసీటు- మీరు చేయాల్సిందల్లా వానికి 'బిట్స్'లో ఓ పది మార్కులు వచ్చేలా చూడటం, 'మైన్ పేపర్' లో మూడు నాలుగు ప్రశ్నలకు జవాబులు చెప్పించటం, అంతే! మా వాడు కొన్ని ప్రశ్నలకు జవాబులు కూడా సిద్ధం చేసుకొని వెళ్ళాడు- వాడు ఆ జవాబులు రాసేటపుడు మీరు చూసీ చూడనట్లు వుంటే చాలు- మరో విషయం 'మ్యాప్ పాయింటింగ్' లో 'డల్' అండీ- అందులోనూ వానికి మీరు సాయం చేయాలి ఈ మాత్రం మీరు దయతలచండి లేకపోతే ఈ ఒక్క సబ్జెక్టు కారణంగా, వానికి ఒక సంవత్సరమంతా నాశన మవుతుంది...." రంగరాజు తన మాటలు ఆపి గంగాధరం కళ్ళలోకి శ్రద్ధగా చూశాడు.

గంగాధరం ముఖం చమటలు గ్రక్కుతోంది- మాటిమాటికి చేతి రుమాలుతో చెమటను తుడుచుకుంటూనే వున్నాడు- తనిక్కడికి రావటం ఎంత మూర్ఖత్వమో తెలిసొచ్చింది. అతనికి- తనసలు యిక్కడికి రాకుండా వుంటే ఎంత బావుండేది అని యిప్పుడు విచారిస్తున్నాడతను- తనలో ఎక్కడో లోపం వుంది- ఏదో ఒక ఆఫీసర్ పిలుస్తున్నాడనేసరికి తన జ్ఞానం నశించిపోయింది- ఎంత ప్లాన్ వేసుకున్నాడీ పెద్దమనిషి? ముందుగానే కావల్సిన ఏర్పాట్లన్నీ చేసుకున్నాడు. తన్ను చదరంగంలో పావులాగా వాడుకోవాలని చూస్తున్నాడు- గంగాధరం కిదంతా కుట్రలా వ్యూహంలా తోచింది..... ఏం జవాబివ్వటానికి అతను స్పష్టంగా సిద్ధంకాలేక పోతున్నాడు.

మీరు మరో విధంగా 'థింక్' చేయకండి- మీరు మాకు చేసే సహాయం మీకేవిషయంలోనైనా చేయటానికి సిద్ధంగా వున్నాను.... మొన్న ఇంగ్లీషు, లెక్కల పేపర్లలో కూడా యిద్దరు ఉపాధ్యాయులు సాయం చేశారు.... మీరుకూడా.... రంగరాజు తన ఆతురతను మాటల్లో చూపుల్లో బలంగా వ్యక్తం చేస్తున్నాడు.

ఈ చదరంగంలో పావు తనొక్కడే కాదన్నమాట- ఇంతకు ముందే యిద్దరు ఉపాధ్యాయుల్ని ఈ మహానుభావుడు వుపయోగించుకున్నాడన్నమాట

గంగాధరం రెండు నిమిషాల మౌనం తర్వాత-"ఇదంతా నాకు కొత్తండీ- ఇలా చేయటం నా మనస్తత్వానికి సరిపడదండీ- పని చేయ టంలో...." యింకా ఏదో అనబోతుండగా రంగరాజు అడ్డొచ్చి "అలా అనకండి- మీ సిన్సియారిటీ నాకు తెలుసండీ- మీకేమీ జరగదు- నేనున్నాను గదా మరో విషయం- మిమ్మల్నే ఎందుకు ఆ రూమ్‌కు వేయిస్తున్నానో తెలుసా- మీ జిల్లాపరిషత్ సెక్రెటరీ నాకు చిరకాల మిత్రుడు- ఆయనే చెప్పాడు- సబ్జెక్టు టీచర్‌ను వేయించికొని తను చెప్పినట్టుగా చెప్పమన్నాడు- ఇప్పుడు ఈ సహాయం నేను కోరుతున్నట్టుగానే మీరు భావించకూడదు- మీ సెక్రెటరీ చెపితే మీరు కాదనగలరా? కాదంటే ఆయనెలా వ్యవహరిస్తాడో మీకు తెలియని విషయమా?"

గంగాధరం రంగరాజు ప్రయోగించిన అస్త్రాన్ని వెంటనే గుర్తించాడు- 'ఎంత గుండెలు తీసిన బంటు' అనుకున్నాడు- "సెక్రటరీని అడ్డు వేస్తున్నాడు- కాదంటే దీనివల్ల అనర్థాలు జరుగుతాయని సూచి స్తున్నాడు- ఔరా?-" తను ఈనాడు రంగరాజు కోరిన సాయం చేయకుంటే వచ్చే అనర్థం ఏ రూపంలో వుంటుందో తను వూహించలేనిదేం గాదు-

ఎనిమిదేళ్ళ క్రితం తనకు జరిగిన అన్యాయం గుర్తుకొచ్చింది గంగాధరానికి- అప్పట్లో తను నాపరాల హైస్కూల్లో పని చేస్తున్నాడు- డిటెన్షన్ పద్ధతి అమలులో వున్న రోజులవి- ఆ సంవత్సరం పూర్తి పరీక్షలు (Annual Exams) జరుగుతూండగా ఒక సంఘటన జరిగింది- 9వ తరగతి చదుతున్న ఆ వూరి సర్పంచ్ కుమార్తె పరీక్షల్లో కాపీ కొడుతుండగా తను పట్టుకొన్నాడు- ఆ అమ్మాయి తెచ్చుకొన్న పేపర్లను లాక్కొన్నాడు-ఆరోజు పరీక్షలో ఆ అమ్మాయి ఏమీ రాయలేక పోయింది- ఆ కారణంగానే ఆ అమ్మాయి ఫెయిలయింది. అంతే! ఆ ఎండకాలం సెలవుల్లోనే అక్కడికి నూరుమైళ్ళ దూరంలో, జిల్లా బోర్డర్‌లో వున్న ఏ సౌకర్యములేని ఒక మారుమూల పల్లెకు తను ట్రాన్స్‌ఫర్స్ కావాల్సి వచ్చింది! తనకు జరిగిన అన్యాయానికి ఆ వూరి సర్పంచీ, పరిషత్ సెక్రెటరి, ఛైర్మన్ యిందరు కారణమయ్యారు- ఆ మారు మూలపల్లెలో ఏడు సంవత్సరాలు నానా అవస్థలూ పడి, తీరా యిప్పుడున్న వూరికి వచ్చి సంవత్సరం కూడా దాటలేదు- మళ్ళీ పరీక్షల కారణంగానే మరో రూపంలో తనకు మరో అన్యాయం జరుగబోతోందా? రంగరాజు ముఖంలోనే ఆ సమాధానం కన్పిస్తున్నట్టు తోచింది గంగాధరానికి-

రంగరాజుముఖం చూస్తుంటే అసహ్యంపెరుగుతోంది గంగాధరానికి- అతని ముఖం నుండి అసహ్యపు కంపువాసన కొడుతున్నట్టు అనిపించింది-

గంగాధరం యిక అక్కడ వుండటమనే స్థితినే భరించలేక పోతున్నాడు- ఇంతకు మునుపు తిన్న పూరీలు కడుపులోగింగుర్లు తిరుగుతూ వాంతి వచ్చేలా అనిపించిందతనికి.

రంగరాజు గంగాధరం ముఖకవళికలు గమనిస్తూ, "ప్లీజ్...." అని ఏదో చెప్పబోయాడు- గంగాధరం సడెన్‌గా లేచి నిలబడ్డాడు- "క్షమించండి- ఇలాంటి పనులు నేను చేయలేను- ఈ పరీక్షల మీద నాకు పెద్ద గౌరవం

లేకపోయినా, నానైతిక హక్కును మాత్రం నేనుగా నేను కోల్పోలేను''
అని గిర్రున వెనక్కు తిరిగాడు.

సంవత్సరం తర్వాత-

గంగాధరం మళ్ళీ పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు, ఇన్విజిలేటర్‌గా, మరో పట్టణంలోని సెంటరుకు నియమింపబడ్డాడు-అతడిప్పుడు పనిచేస్తున్నది కొత్తపల్లెలోగాదు- వెంకటాపురంలో- అది కొత్తపల్లెకు రెండు తాలూకాల ఆవల వుంది.

-ఆ రోజు సైన్స్ రెండవ పేపరు, పరీక్ష-

గంగాధరం రూమ్ నెంబర్ 1లో విద్యార్థులను పర్యవేక్షణ చేస్తున్నాడు-

పరీక్ష అప్పుడే ప్రారంభమయింది.... గంగాధరం తన మామూలు ధోరణి లో విద్యార్థులను హెచ్చరిస్తున్నాడు- ఎవరి దగ్గరయినా కాగితా ల్లాంటివి వుంటే వెంటనే యిచ్చి వేయండి. నిన్న పక్క వూరి సెంటర్లో 'స్క్వాడ్' నలుగుర్ని బుక్ చేసింది- ఈ రోజు యిక్కడకు స్క్వాడ్ రావచ్చు- మీ దగ్గర కాగితాలుంటే యిచ్చేయండి''

విద్యార్థులకు గంగాధరం అరుపులేమీ పట్టినట్టులేదు. రోజూ వింటున్న పురాణమే వారికిది.

అరగంట గడిచింది.

గంగాధరం కాలు కాలిన పిల్లిలాగదంతా గస్తీ తిరుగుతున్నాడు- బయట ఎండ తీవ్రంగా వుంది. ఆవరణలో వున్న చెట్టు కింద ఒక పోలీసు పరవశత్వంతో బీడీ కాలుస్తున్నాడు- మరో పోలీసు స్టూల్ మీద కూచొని డిటెక్టివ్ నవల సీరియస్‌గా చదువుతున్నాడు. చెట్టుమీద పక్షులు ఎండ వేడిమికి రెక్కలు టపటపా తాటిస్తున్నాయి.

గదిలో పిల్లలు కాగితాలతో కుస్తీలు పడుతున్నారు.

గంగాధరం గదంతా పచార్లు చేస్తూనే వున్నాడు.

'సడెన్'గా తలుపు ముందు ఏదో వాహనం ఆగిన చప్పుడు- మనుషులు కిందికి దిగి దబదబా నడుస్తున్నా శబ్దం గంగాధరం కిటికీ గుండా చూసే సరికి యిద్దరు హడవుడిగా లోపలకు రావటం- అంతా నిమిషాల మీద జరిగిపోయింది....

ఆ వచ్చిన వారిలో ఒకరు పోలీస్ ఆఫీసర్-కాకీ దుస్తుల్లో గది ఎత్తునా కన్పిస్తున్నాడు- మరొకరు స్క్వాడ్ ఆఫీసర్- ఫుల్‌సూట్‌లో ఉన్నాడు. కొత్తగా కుట్టించుకున్నట్టుంది- దుస్తుల్లో ఠీవిగా కన్పించాలని తాపత్రయ పడుతున్నట్టుంది. గదంతా చక చక తిరిగాడు- ఇద్దరు పిల్లల్ని హుందాగా చెక్ చేశాడు- నిరాశపడ్డట్టుంది- మళ్ళీ గదిలో చిందులు తొక్కాడు- మరో విద్యార్థి దగ్గర ఆగి 'లేచి నిలబడు' అన్నాడు. ఆ అబ్బాయి బెరుగ్గా లేచి నిలబడి ఆఫీసర్ ముఖంలోకి దయనీయంగా చూశాడు. ఆఫీసర్ ఏదో పసి గట్టినట్టు ఆ విద్యార్థి జేబులన్నీ తడిమి తడిమి చూశాడు- ఏమీ కన్పించ లేదు. డెస్క్ మీదున్న పేపర్లను ఎత్తి చూశాడు- అతని కళ్ళు మెరిశాయి- ప్రశ్న పత్రానికీ, 'ఆన్సర్‌బుక్'కూ మధ్య అరచేతి వెడల్పుతో సన్నటి అక్షరాలతో పేపర్- ఆ కాగితంలోని అక్షరాలను ఆన్సర్ బుక్‌లోని అక్షరాలను పోల్చి చదివాడు- ఒకే మాటర్- పచ్చి కాపీ- 'రెడ్‌హాండ్'గా చిక్కిపోయాడు- "హ హ్హ హ్హ" అని వికటాట్టహాసం చేయబోయి ఆపు కున్నాడు- ఆ అబ్బాయి ముఖం వెలవెల బోయింది. శరీరమంతా వణకు తోంది- గదిలోని పిల్లలందరూ భయంగా ఆశక్తిగా తలలు తిప్పి చూస్తున్నారు గంగాధరం కిటికీ దగ్గర నిలబడే చూస్తున్నాడు- ఆ పిల్లవాని ముఖంలోకే చూస్తున్నాడు.

"ఏంరా! తల తిరుగుతోందా? నీ దగ్గరింకా ఏమేమున్నాయో బయటకు తీ! గద్దించాడు ఆఫీసర్-

"లేవుసార్.... అవొక్కటే సార్.... తప్పయింది" ఆ అబ్బాయి మాటలు బాగా తడబడుతున్నాయి..

"ఇప్పుడు నీకు తప్పు అనిపిస్తోందేమిరా? ఈ బుద్ధి ముందుగానే వుండాలిరా? ఈ శ్రద్ధ, తెలివీ చదువు మీద వుండాలిరా? ప్రతిచోటా యిదే- మీకు పరీక్షలంటే భయంవుంటే గదా! బొత్తిగా క్రమశిక్షణ నశించిపోయింది. కాపీ కొట్టడం మీ జన్మహక్కయి పోయింది పాపం! మీరేం చేస్తారు- మిమ్ముల్నిలా తయారు చేసిన మీ తల్లిదండ్రుల ననాలి.... ఉపన్యాసం యిచ్చే అవకాశం వచ్చినందుకు అతడు మురిసిపోతున్నట్లుంది. ఆ విద్యార్థి "....క్షమించండి సార్.... యింకెప్పటికీ చేయను...." అని బోరున ఏడ్చేశాడు....

"సిగ్గులేదురా ఏడ్వటానికి-నడు-బయటికి నడు-" అంటూ ఆ విద్యార్థి ఆన్సర్ బుక్‌నూ, ఆ కాగితం ముక్కను తన చేతుల్లోకి తీసుకొని పిన్‌వేసి వెనక్కు కదిలాడు ఆఫీసరు——

గంగాధరం వెనుక భాగం నుంచీ ఆ ఆఫీసర్‌వేపే చూస్తూ, ఏవో జ్ఞాపకాలు తొలుస్తూండగా, ముందుకు అడుగులు వేసి, తన వేపు వస్తున్న ఆఫీసర్ ముఖంలోని చూసి తటాలున ఆగిపోయాడు. ఆ ఆఫీసర్ ఏదో చెప్పబోతూ తలెత్తి గంగాధరం వేపు చూశాడు.

గంగాధరం స్థాణువులా నిలబడి వున్నాడు....

గంగాధరం ఎదురుగా స్క్వాడ్ ఆఫీసరు.... ఆనాడు తన కుమారునికి కాపీ కొట్టించడంలో తన్ను సహాయం కోరిన 'రంగరాజు....' డిప్యూటీ తాసీల్దారు....

(రచనాకాలం - జూన్ 79, ప్రచురణ : ఉపాధ్యాయ - జూలై 79.)